క్లుప్తంగా

బైపాస్ రోడ్డు సమస్యలు పరిష్కరించండి

గుడివాడ టౌన్: కొత్త బైపాస్‌రోడ్డు ఇరువైపులా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని భవిష్యత్ భద్రతాదళం సభ్యులు కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎస్. మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళం సభ్యులు మాట్లాడుతూ బైపాస్ రోడ్డుకు ఇరువైపులా సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఆక్రమణలు, మెరక తోలకాల వలన వర్షంవస్తే నీరు నిల్వ ఉంటుందని తెలిపారు. దీని వలన రోడ్డుపై నీరు నిలిచి వాహనాల రాకపోకలతో రోడ్డు గుంతలమయం అవుతోందన్నారు. తక్షణమే డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని వారు కోరారు. భవిష్యత్ భద్రతాదళం సభ్యులు ఎండీ తెహర్‌బాషా, జి. పూర్ణచంద్రరావు, ఎం.దుర్గారావు వినతిపత్రం సమర్పించారు.

మసీదు షాపుల సముదాయం పరిశీలన



గుడివాడ టౌన్: నియోజకవర్గంలో మైనార్టీల సంక్షేమానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం స్థానిక గుల్జార్ చౌక్ మసీదుకు చెందిన షాపుల సముదాయాన్ని ఆయన పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను కొనసాగించేందుకు అడ్డంకులను తొలగించే ప్రయత్నం చేస్తామన్నారు. మొత్తం 28 షాపులు ఉన్నాయని, వాటిని వినియోగంలోకి తీసుకురావడం వలన మైనార్టీలకు కొంత మేలు జరుగుతుందన్నారు. దుకాణం అద్దెదారులు, మసీదు పెద్దలతో చర్చిస్తామని తెలిపారు. ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

సబ్సిడీపై పశువుల దాణా

మండవల్లి: తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 50 శాతం సబ్సిడీపై 50 కిలోల పశువుల దాణా అందజేయనున్నట్లు మండవల్లి పశుసంవర్ధకశాఖ ఏడీ డి.వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 కిలోల దాణా ధర రూ. 1,110 కాగా 50 శాతం సబ్సిడీపై రూ.555 చెల్లించాలని పేర్కొన్నారు. చింతపాడుకు మూడు మెట్రిక్ టన్నులు, చావలిపాడు 2 టన్నులు, కానుకొల్లు 7.50 టన్నులు, ముదినేపల్లి 4.50 టన్నులు, ప్రొద్దువాక 4 టన్నులు, పెదగొన్నూరు 4 మెట్రిక్ టన్నులు అందజేసినట్లు పేర్కొన్నారు. దాణా కావాల్సిన రైతులు ఆయా కేంద్రాల వద్ద సేకరించకోవచ్చని తెలిపారు.

రక్తదానం

గుడివాడ టౌన్: ప్రమాదంలో గాయపడిన యువకునికి తమ ట్రస్ట్ సభ్యుడు రక్తదానం చేసినట్లు కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సీతయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముదినేపల్లి మండలం గురజ గ్రామానికి చెందిన టి. సత్యనారాయణ ప్రమాదవశాత్తు గాయపడి పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా రక్తం అవసరం అయిందని తెలిపారు. తమ ట్రస్ట్ సభ్యుడు దేసు సూర్య స్పందించి రక్తదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రక్తదానం అవసరమైనవారు 93463 34954లో సంప్రదించాలని కోరారు.

దాసాంజనేయుడికి విశేష పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలోని సీతారామ దాసాంజనేయ స్వామి దేవస్థానంలో 75వ హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్తలు పల్నాటి సత్యనారాయణ, చోడే వెంకయ్య కుటుంబ సభ్యులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆలయాన్ని సందర్శించి, స్వామి వారికి విశేష పూజలు చేశారు. స్వామి వారి ఉత్సవమూర్తిని ప్రత్యేక వాహనంపై సీతారామపురం, ఏపూరు, రైల్వే స్టేషన్, బాపులపాడు ఏరియాలో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం మహా అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

దట్టంగా పెరిగిన గుర్రపుడెక్క.. నీరు పారేదెలా?

- రైతుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు

మోపర్రు (పెదపారుపూడి): మండలంలోని మోపర్రులోని వన్నేరు డ్రెయిన్‌లో తూడు, గుర్రపుడెక్క దట్టంగా పెరగడంతో నీరు ఎలా పారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వన్నేరు డ్రెయిన్ కింద సుమారు 200 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేస్తుంటారు. వరి నారుమడులు పోసే సమయంలో వచ్చిన డ్రెయినేజీ అధికారులు ఇంత వరకు దట్టంగా ఉన్న గుర్రపుడెక్క నివారణ చర్యలు చేపట్టకపోవటంతో ఇబ్బందిగా మారిందని గ్రామానికి చెందిన రైతు బోయిన శివయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

పంట పొలాలు నీట మునిగే ప్రమాదం

ప్రస్తుతం వరి నారుమడులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు రైతులు పేర్కొన్నారు. ఇప్పుడు డ్రెయిన్‌లో గుర్రపుడెక్క నివారణ చర్యలు చేపట్టకపోతే రాబోయే రోజుల్లో వర్షాలు కురిస్తే పంట పొలాలు నీట మునిగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. డ్రెయినేజీ అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి వన్నేరు డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టాలని కోరుతున్నారు.



మోపర్రులోని వన్నేరు డ్రెయిన్‌లో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్క

సర్వేకు వ్యాపారులు సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ మనోహర్

గుడివాడ టౌన్: పట్టణంలో సర్వే చేసే అధికారులకు స్ట్రీట్ వెండర్స్(వీధి వ్యాపారులు) సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం వ్యాపారులతో మున్సిపల్ కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో వీధి వ్యాపారుల సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వే యొక్క అవసరతను వారికి వివరించారు. ప్రతిఒక్కరూ ఆ సర్వేలో పాల్గొనాలని సూచించారు. సర్వే అనంతరం ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డుతో పాటు వ్యాపార ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తామన్నారు. వెండర్స్ జోన్ ఏర్పాటు చేస్తామని, వ్యాపారులకు సంబంధించిన సమస్యలు కూడా చర్చకు వస్తాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, ఏసీపీ వి. ఏసుబాబు, సిటీ మిషన్ మేనేజర్ కేఈవీ బసవేశ్వరరావు, వన్‌టౌన్ సీఐ కె. శ్రీనివాస్, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు ప్రతిమ, వీధి వ్యాపారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

యోగా దినోత్సవాన్ని జయప్రదం చేయండి

అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21వ తేదీన నిర్వహిస్తున్న సందర్భంగా ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ పిలుపునిచ్చారు. జూన్ 21వ తేదీ వరకు సచివాలయ కార్యదర్శులు, పట్టణ ప్రజలు యోగాలో పాల్గొనేందుకు ఇంటింట సర్వే నిర్వహిస్తారన్నారు. యోగాలో పాల్గొనేందుకు ఆసక్తిగల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సందర్భంగా అక్కడ పాల్గొనదలచిన వారి పేర్లను సచివాలయ ఉద్యోగులకు తెలియజేయాలని కమిషనర్ కోరారు.

కూటమి ప్రభుత్వం అవినీతిమయం

మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: కూటమి పాలన అవినీతిమయంగా మారిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్నా ఇచ్చిన హామీలేమీ నెరవేర్చడం లేదన్నారు. ప్రజల సమస్యలను గాలికొదిలేసి, ఇసుక, మట్టి దోపిడీపై దృష్టి పెట్టారన్నారు. మండలంలోని మర్రివాడలో ఇటీవల మృతిచెందిన పార్టీ కార్యకర్తల పరామర్శకు వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కూటమికి ఓటేసిన అన్ని వర్గాలు నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వ పథకాలేవీ అందడం లేదన్నారు. గ్రామాల్లో ఏకపక్షంగా పెన్షన్లు తొలగిస్తున్నారని, కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుదారులు ప్రభుత్వ నిబంధనలతో ఇబ్బందులు పెడుతున్నారన్నారు. గ్రామాల్లో టీడీపీ నాయకులు నియంత పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. ప్రతి పథకం టీడీపీకే కేటాయిస్తున్నారన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా తమ వైఎస్సార్ సీపీ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి, ఎంపీటీసీలు ఊబా మల్లేశ్వరి, కూచిపూడి శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీలు మహేష్, సీతారామయ్య, నాయకులు మస్తాన్‌రావు, కోటయ్య, నాగరాజు, హరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ

కైలే అనిల్‌కుమార్ మర్రివాడ, గోపువానిపాలెం, తాడంకి గ్రామాల్లో పర్యటించి ఇటీవల మృతిచెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన, మృతిచెందిన ఆశ వర్కర్ల కుటుంబాలను పరామర్శించారు. పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



మర్రివాడలో ఆశ వర్కర్ గుండే మల్లేశ్వరిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్

ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వర్షం నీరు



మండవల్లి: మండవల్లిలో ప్రభుత్వ కార్యాలయాలు పరిసరాలు అధ్వానంగా మారాయి. ఇక్కడ ఉన్న గుంత చిన్నపాటి వర్షానికే మునిగిపోతుంది. ఈ గుంత వెంబడి ఎంపీడీఓ, తహసీల్దార్ , ఎంఈఓ కార్యాలయం, వ్యవసాయశాఖ తదితర కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బందిని వివిధ పనుల నిమిత్తం కలవడానికి మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు ప్రతి నిత్యం వస్తుంటారు. గుంతలో ఉన్న మురుగునీటి కారణంగా దోమల వంటి క్రిమి కీటకాలు కార్యాలయాల్లోకి ప్రవేశించడంతో అధికారులు, ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. ఇప్పటికైనా కార్యాలయాల వద్ద ఉన్న గుంతలో వర్షం నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాజశేఖరస్వామి హుండీ ఆదాయం రూ.2.91 లక్షలు

అవనిగడ్డ: స్థానిక రాజశేఖరస్వామి ఆలయంలోని హుండీ కానుకలను శనివారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన లెక్కింపులో రూ.2,91,184 వచ్చిందని ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు చెప్పారు. 16 నెలల కాలానికి గాను హుండీ లెక్కింపు చేపట్టామన్నారు. లెక్కింపును మచిలీపట్నం దేవదాయ తనిఖీ అధికారి శ్రీనివాస్, ఈఓ యార్లగడ్డ పర్యవేక్షించారు.

కొనసాగుతున్న అమలేశ్వరి దేవి ఉత్సవాలు



పెడన: మండల పరిధిలోని దావోజీపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న అంకెంవారి ఇలవేల్పు విజయ అమలేశ్వరి దేవి ఉత్సవాలు శనివారంతో మూడో రోజుకు చేరాయి. 11 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ జాతర ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు అమ్మవారిని రోజుకొక రూపంలో అలంకరించనున్నారు. ప్రతి రోజు పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

ప్రతిఒక్కరికీ సాంకేతిక విద్య అవసరం



జమీగొల్వేపల్లిలో విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తున్న నాగసురేష్

జమీగొల్వేపల్లి(పామర్రు): ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రతిఒక్కరికీ సాంకేతిక విద్య ఎంతో అవసరమని గ్రంథలయాధికారి వి.నాగసురేష్ అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా శనివారం 'సాంకేతిక విద్య–ఆవశ్యకత' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, ఉద్యోగం, వ్యాపారం దేనికైనా సాంకేతిక విద్య అవసరమని తెలిపారు. ఆధునిక జీవితంలో కంప్యూటర్లు అంతర్భాగంగా మారాయన్నారు. కంప్యూటర్ విద్య ద్వారా సమాచార, సాంకేతిక నైపుణ్యాలను విద్యార్థులు పొందగలుగుతారని తెలిపారు. ప్రతి విద్యార్థీ సాంకేతిక విద్యపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు.



జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన పెంచుకుంటున్న విద్యార్థులు

కార్యక్రమంలో పి.పద్మావతి పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయశ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాలపై శనివారం అవగాహన కల్పించామని గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి తెలిపారు.

కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన

మండవల్లి: విద్యార్థులు కంప్యూటర్‌పై పరిజ్ఞానం పెంచుకోవాలని లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీన పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్‌పై అవగాహన కల్పించారు. పర్వీన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

వసతి గృహాల్లో నూరుశాతం ప్రవేశాలు లక్ష్యం

కైకలూరు: ఏల్లూరు జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర, బాలికల వసతి గృహాల్లో నూరుశాతం విద్యార్థుల చేరికల లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందరూ పనిచేయాలని సాంఘిక సంక్షేమశాఖ జేడీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మేరుగు ముక్కంటి అన్నారు. కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో సాంఘిక సంక్షేమశాఖ కైకలూరు డివిజన్ సమీక్ష సమావేశం శనివారం జరిగింది. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి, గణపవరం మండలాల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు(హెచ్‌డబ్ల్యూఓ), సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, హాస్టళ్ల సిబ్బందికి అసిస్టెంటు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ (ఏఎస్‌డబ్ల్యూఓ) బి.వెంకటరత్నమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జేడీ ముక్కంటి మాట్లాడుతూ ఎస్సీ హాస్టళ్లలో మరమ్మతుల పనులు జరుగుతున్నాయన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి పనులను పూర్తి చేయాలన్నారు. మండలంలో హాస్టళ్ల సంఖ్యను సైతం కొందరు వెల్ఫేర్ అసిస్టెంట్లు చెప్పలేకపోవడం, వార్డెన్ ఎవరో తెలియదని అనడంతో జేడీ వారిపై మండిపడ్డారు. గణపవరం వార్డెన్ సూరమ్మ హాస్టల్‌పై పర్యవేక్షణ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఎవరనేది తేలడం లేదని, దీని వల్ల పనులు కుంటుపడుతోన్నాయని జేడీకి వివరించారు. సమస్యను జిల్లా కలెక్టర్‌కు వివరిస్తానన్నారు. సమావేశానికి హాజరుకాని సిబ్బందికి షోకాజు నోటీసులు జారీ చేయాలని జేడీ ఏఎస్‌డబ్ల్యూఓ వెంకటరత్నమ్మను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా హాస్టళ్ల వార్డెన్లు ఎస్.నాగమణి, కె.అనిత, పి.శివ, కె.నాగమణి, ఆర్‌వీఏ.స్వామి పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో మాట్లాడుతున్న జిల్లా సోషల్ వెల్ఫేర్ జేడీ ముక్కంటి

వైఎస్సార్ సీపీ నేతకు మాజీ ఎమ్మెల్యే కైలే పరామర్శ

పామర్రు: వైఎస్సార్ సీపీ పామర్రు టౌన్ అధ్యక్షుడు నందిపాటి సురేష్‌రెడ్డి తల్లి నందిపాటి విజయలక్ష్మి(65) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ శనివారం విజయలక్ష్మి మృతదేహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సురేష్‌రెడ్డిని పరామర్శించారు. జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు టీ శ్రీనివాసరావు, ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీలు శ్రీనివాసరావు, రమాదేవి, ఎంపీటీసీ పీ రత్నకుమారి, కో–ఆప్షన్ సభ్యులు హస్మతుల్లా, ఉప సర్పంచ్ బాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, అప్పిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సురేష్‌రెడ్డి తల్లి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కైలే అనిల్‌కుమార్

పశుపోషణపై దృష్టి సారించండి

పమిడిముక్కల: వ్యవసాయంతో పాటు పశుపోషణపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా రైతులకు సూచించారు. వీరంకిలాకు పశువైద్యశాలలో శనివారం రైతులకు రాయితీపై పశువుల దాణాను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేలుజాతి పశువుల పెంపకం ద్వారా అధిక పాల దిగుబడి సాధించాలన్నారు. వైద్యాధికారి రాంనరేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పమిడిముక్కల్లో పల్లెనిద్ర..

ప్రగతి పథంలో పామర్రు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే వర్ల కుమార రాజా పమిడిముక్కల ఎస్సీ కాలనీలో పల్లెనిద్ర చేశారు. శనివారం ఉదయం గ్రామంలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయాలని కాలనీ వాసులు కోరారు. ఎమ్మెల్యే వెంట పర్యటనలో సర్పంచ్ ముళ్లపూడి సునీత, కృష్ణాపురం డీసీ చైర్మన్ నాదెళ్ల సుబ్రమణ్యం, ఉపసర్పంచ్ ఇమడాబత్తిన వెంకటేశ్వరావు, నాయకులు మైనేని నరేంద్ర, పరసా శిల్పిబాబు తదితరులు పాల్గొన్నారు.



పశువుల దాణాను రైతులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

ఘనంగా సోదరుల దినోత్సవం

పామర్రు: అన్నదమ్ముల అనుబంధం ఎంతో గొప్పదని ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ పేర్కొన్నారు. అన్నదమ్ముల దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామంలోని పలువురు అన్నదమ్ములను శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదమ్ములు కలిసి మెలిసి ఉన్న ఇల్లు ఎంతో సంతోషంగా ఉంటుందన్నారు. ఉమ్మడి కుటుంబాలు అంతరించి పోతున్న రోజుల్లో అన్నదమ్ములు ఐక్యంగా ఉండాలన్నారు. వారి కష్టసుఖాలను ఒకరినొకరు పంచుకుంటూ జీవనాన్ని సాగించాలన్నారు. అనంతరం పరిశ వెంకటనాంచారయ్య బ్రదర్స్, బొగ్గరపు సాయిబాబు, శ్రీనివాస్ బ్రదర్స్, తాళ్లూరి నరేష్ బ్రదర్స్, ముప్పిటి బ్రదర్స్, బొమ్మిశెట్టి చంద్రమౌళి బ్రదర్స్‌ను సన్మానించారు.



తాళ్లూరి నరేష్ బ్రదర్స్‌ను సత్కరించిన కళాపీఠం అధ్యక్షుడు మురళీకృష్ణ

ఈద్గా ప్రహరీ నిర్మించండి

కైకలూరు: బరేల్ గ్రౌండ్(కైకలూరు ఈద్గా)కు ప్రహరీ నిర్మించాలని స్థానిక జామియా మసీద్, చిన్న మసీదు కమిటీ సభ్యులు శనివారం వరహాపట్నంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌ను కలసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ రాష్ట్ర ముస్లిం మైనారిటీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎండీ ఫారుఖ్‌ను సంప్రదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ముస్లింలు అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మహిళా లోకానికి ఆదర్శమూర్తి అహల్యాబాయి



ప్రసంగిస్తున్న బీజేపీ ప్రధాన కార్యదర్శి మధుకర్

కైకలూరు: మహిళా లోకానికి పవిత్రమూర్తి అహల్యాబాయి హోల్కర్ ఆదర్శనీయురాలని బీజేపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ(ఆర్గనైజేషన్) ఎన్.మధుకర్ పేర్కొన్నారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక సీతారామ ఫంక్షన్ హాల్లో జిల్లా స్థాయిలో అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మధుకర్ మాట్లాడుతూ 17వ శతాబ్దంలో 30 సంవత్సరాలు ఇండోర్ ప్రాంతాన్ని అహల్యాబాయి పాలించిందన్నారు. భారతదేశంలో 152 హిందూ దేవాలయాలకు దానాలు, నూతన కట్టడాలు నిర్మాణం, మరమ్మతులు చేయించారన్నారు. పవిత్ర కాశి, శ్రీశైలం ఇలా అనేక ఆలయాల అభివృద్ధిలో ఆమె పాత్ర ఉందన్నారు. ఆమె చొరవను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నాయకులు బాధితులకు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కామినేని, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, కైకలూరు ఎంపీపీ అడవి కృష్ణ, బీజేపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నిర్మలా కిషోర్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీబీసీఎన్‌సీ పాఠశాలలను తెరిపించండి

పామర్రు: గతంలోమూత పడిన సీబీసీఎన్‌సీ పాఠశాలలను తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు శనివారం పలువురు పాస్టర్లు అర్జీని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంత కాలంగా పాఠశాలలు మూతబడిన కారణంగా స్థానికంగా చిన్నారులు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ విషయమై సత్వరమే స్పందించి పాఠశాలలను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతే కాకుండా నియోజకవర్గంలోని భట్ల పెనుమర్రు, యాకమూరు గ్రామాల్లోని చర్చిలకు స్థలాలను కేటాయించాలని కోరామన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీబీసీఎన్‌సీ ట్రస్టు చైర్మన్ పరిమి ఇమ్మానుయేల్ దీపక్‌కుమార్, ఉయ్యూరు ఫీల్డ్ కౌన్సిల్ అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ కె యేసుదాసు, కౌన్సిల్ సెక్రటరీ వల్లూరు రవీంద్రబాబు, సభ్యులు ఆలూరి విలియం కేరి, మాచర్ల సువర్ణలత పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కృత్తివెన్ను: మండల పరిధిలోని కొమల్లపూడి పాటిమీద మూడేళ్ల ఒకసారి చైత్రమాసంలో జరిగే శ్రీపోలేరమ్మ జాతర మహోత్సవాలు భక్త బృందం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 21 నుంచి 25 వరకు జరుగుతున్న ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. శనివారం నియోజకవర్గంతో పాటు ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి అమ్మ వారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

